ప్రజాశక్తి
శనివారం 10 ఆగస్టు 2024
5

అల్లూరి సీతారామరాజు

బాల్య వివాహాలను అరికట్టాలి

- సిఐ సన్యాసినాయుడు

ప్రజాశక్తి -హుకుంపేట:స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలు అనర్థాలపై శుక్రవారం ఐసిడిఎస్ సిడిపిఒ సిహెచ్ బాలమణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సన్యాసి నాయుడు మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టేందుకు సచివాలయం మహిళా పోలీసులు, అంగన్వాడిలు బాధ్యత వహించాలన్నారు. స్కూల్ డ్రాప్ ఔట్స్‌పై ఆరా తీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఒపిఆర్‌డీ ఆర్ఐ సీతమ్మ, వెలుగు సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్‌వైజర్స్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ సన్యాసినాయుడు

అడవి బిడ్డల అభివృద్ధికి కృషి

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ - ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

పాడేరులో గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న కలెక్టర్, పిఒ

రంపచోడవరంలో వేడులకు హాజరైన ఎమ్మెల్యే, పిఒ

ప్రజాశక్తి-పాడేరు:ప్రకృతిని, పర్యావరణాన్ని నిరంతరం కాపాడుతూ, జీవిస్తున్న ఆదివాసీలే నిజమైన మానవతా వాధులని, వారి అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఉద్ఘాటించారు. శుక్రవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఐటిడిఏ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సాన్ని నిర్వహించారు. ముందుగా ఐటీడీఏ నుంచి అధికారులు కళాకారులు విద్యార్థులతో అంబేద్కర్ స్టేడియం ప్రాంగణం వరకు కార్నివాల్ నిర్వహించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ సభలో మాట్లాడుతూ, సుస్థిరత, స్థిరత్వాన్ని గిరిజనులను చూసి నేర్చుకోవాలన్నారు. మానవత్వం గురించి ప్రపంచ స్థాయిలో చర్చలు జరిపినప్పుడు పర్యావరణాన్ని ఎవర రక్షిస్తున్నారో వారే మానవతా వాదులని నిర్ణయించారని చెప్పారు. ఆదివాసీల హక్కులను రక్షించ వలసిన అవసరం ఉందన్నారు. షెడ్యూలు 5 నిబంధనలు పక్కాగా అమలు చేయాలని తెలిపారు. గిరిజన హక్కుల కోసం పోరాడుతున్న నేతలు ఐదవ షెడ్యూలు లో ఉన్న హక్కులుపై అవగాహన కల్పించాలని చెప్పారు. గిరిజన ప్రాంతంలో అనేక విద్యా మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. సుమారు 950 గ్రామాలకు రోడ్లు లేవన్నారు. వచ్చే మూడేళ్లలో రోడ్లు, వంతెనలు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ గిరిజనాభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ మాట్లాడుతూ, విద్యార్థులు ఆలోచనా విధానం లో మార్పు వచ్చేలా బోధన సాగించాలని సూచించారు. గిరిజన యువతకు ప్రాజెక్టు లక్ష్యతో సివిల్స్ కోచింగ్ అందిస్తున్నామన్నారు.ఆదివాసీ జెఎసి కన్వీనర్ రామన్నదొర, మండల ఇంజనీరింగ్ అధికారి మాణిక్యం గిరిజన హక్కులపై ప్రసంగించారు. వివిద పాఠశాలలకు చెందిన విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించారు.

ప్రకృతి వ్యవసాయంపై స్టాల్స్ ఏర్పాటు చేసారు. ముందుగా ఐటిడి ఏ కార్యాలయం ఆవరణలో ఉన్న అల్లూరి సీతారామరాజు, గాం మల్లుదొర, భగవాన్ బిర్సాముండా విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళు లర్పించారు.ఆదర్శ కాఫీ రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకర్, ఎం.వేంకటేశ్వరరావు, డిఆర్ఓ బి. పద్మావతి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం. హేమలత, ఎస్‌సి వి.వి. ఎస్ .శర్మ, పశు సంవర్ధక శాఖ డిడి నరసింహులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ భాషా, డి.ఆర్.డి.ఏ .పిడి. వి.మురళి, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందరబాబు, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డిఎల్‌పిఒ పి. ఎస్.కుమార్ పాల్గొన్నారు.

రంపచోడవరం :ప్రపంచ ఆదివాసీ దినోత్సవం స్థానిక ఐటిడిఎ ప్రాంగణంలో అన్ని గిరిజన తెగలతో కలిసి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఎడిఎంహెచ్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని, ప్రత్యేక మెడికల్ క్యాంపును పరిశీలించారు. ఏజెన్సీలోని ఏడు గిరిజన తెగలకు సంబంధించిన సంస్కృతి, సాంప్రదాయాల స్టాల్స్‌ను, పవర్ విడర్, జిసిసి, ఐసిడిఎస్, ఇరిగేషన్ శాఖ, హార్టికల్చర్ స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీలోని అన్ని గిరిజన తెగలు కలిసికట్టుగా ఏజెన్సీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. జీవో నెంబర్ 3ను పునరుద్ధరించే విధంగా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఐటీడీఏ పిఒ కట్టా సింహాచలం మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ 1/70 చట్టం పక్కాగా అమలు చేస్తామని, గిరిజన భూములు నిబంధన ప్రకారం మ్యూటేషన్ చేయడం జరుగుతుందని చెప్పారు. మారుమూల గ్రామాలలో సెల్ టవర్లు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.ఎమ్మెల్యే శిరీషరాణి, ఆమె భర్త మఠం విజయభాస్కర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు, ఆదివాసీ నాయకులు కంగల శ్రీనివాసరావు దొర, వెదుళ్ళ లచ్చిరెడ్డి, కత్తుల ఆదిరెడ్డి, గొర్లె చిన్న నారాయణరావు, తీగల బాబురావు, వెన్నెల సోమయ్య, ఎంపిపి బంధం శ్రీదేవి, జెడ్పిటిసి పండ వెంకటలక్ష్మి, స్థానిక సర్పంచ్ మంగ బొజ్జయ్య, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, సాయి, వి.ప్రసాద్, పండు దొర, ఐటిడిఎ ఎపిఒ సిహెచ్ శ్రీనివాసరావు, ఐటీడీఏ పరిపాలన అధికారి డిఎన్వి రమణ, జీసీసీ డిఎం జి.పార్వతీశ్వరరావు, పిహెచ్ఓ చిట్టిబాబు, ఎపీడీలు జి.శ్రీనివాసరావు, ఎడియంహెచ్ఓ జి.శిరీష, ఎ.శ్రీనివాసరావు, సిడిపిఒ సంధ్యారాణి, ఏడిఏ సిహెచ్ కెవి చౌదరి, వ్యవసాయ శాఖ అధికారి కిందుకూరు లక్ష్మణరావు, కృష్ణ జ్యోతి, పులి మెట్ల మోహన్, బి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాయిద్యాన్ని వాయిస్తున్న కలెక్టర్, పిఒ

నిరాశ మిగిల్చిన సిఎం

- జిఒ 3 చట్టబద్ధత, ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలపై ప్రకటన చేయకపోవడం శోచనీయం

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర, చిత్రంలో జెడ్‌పిటిసి గంగరాజు తదితరులు

ప్రజాశక్తి-అనంతగిరి

ఆదివాసీ దినోత్సవం రోజున జిఒ 3 చట్టబద్ధత, ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై సీఎం చంద్రబాబునాయుడు ప్రకటన చేస్తారని ఆశించిన ఆదివాసీలకు నిరాశ కలిగిందని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర తెలిపారు. ఆదివాసీల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి వున్నా తక్షణమే జిఒ 3కు చట్టబద్ధత కల్పిస్తూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం అనంతగిరిలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల అభివృద్ధి పై ప్రభుత్వం విధాన పత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, ఆదివాసీల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దెబ్బ తీస్తున్నాయని విమర్శించారు. అడవిలో విలువైన వనరులను కార్పొరేట్ వ్యాపారులకు అప్పగించేందుకు ఆదివాసీ హక్కులను బలహీనం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి సర్పంచ్ సోమెల రూతు, టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు సివేరి కొండలరావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మజ్జి అప్పలరాజు, యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి పుడిగి దేముడు, మండల యూపీఎఫ్ ప్రధాన కార్యదర్శి బిడ్డ సింహాచలం, సోమెల నాగులు, ఎన్.మల్లేశ్వరరావు, వి.వి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామారావు

జెండాను ఆవిష్కరిస్తున్న లోతా రామారావు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : గిరిజనుల హక్కులు, చట్టాలు పట్టిష్ట అమలుకు ఆదివాసీ దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని ఆదివాసీ జేఏసీ నాయకులు లోతా రామారావు, వంతు బాలకృష్ణ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రాజవొమ్మంగి ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ఆదివాసీ జెండాను లోతా రామారావు, వంతు బాలకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో వందలాదిమంది ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించారు. జీవో నెంబర్ 3కి చట్టభద్రత కల్పించాలని, ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులతోనే భర్తీ చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం రామారావు, బాలకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు గిరిజనులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన ఆదివాసి సంస్కృతి, సాంప్రదాయ నృత్యాలు, వేషధారణలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెఎసి నాయకులు వజ్రపు అప్పారావు, బొడారపు కృష్ణ, తాము సూరిబాబు, సిహెచ్.నరేష్, ఈ.శ్రీను, డి పైడిమల్లు, ఎస్ అచ్చారావు, కె సూరిబాబు, జి.పెద్దిరాజు, సిహెచ్ శివ, కె మురళీకృష్ణ, ఎస్ చంద్రుడు, జి.రమణి, జి వెంకటలక్ష్మి వి జ్యోతి, ఎస్ లోవలక్ష్మి, పాల్గొన్నారు.

విఆర్.పురం : ఐక్యంగా పోరాటాలు చేయడం ద్వారానే ఆదివాసీల మనుగడ సాధ్యమవుతుందని విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి అన్నారు. మండలంలోని రేఖపల్లి కెజిబివిలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జెండాను ఎంపిపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీలను అడవి నుండి వేరు చేయడానికి కుట్రలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు చిన్నమట్టపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, నాయకులు కారం సుందరయ్య, వేటగాని సూరిబాబు, ఈశ్వర్, ఉయిక పవన్, యుటిఎఫ్ నాయకులు సోడి నాగేశ్వరరావు, జల్లి బాబురావు, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, పూనెం సత్యనారాయణ, కుంజ కన్నయ్య పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ చేస్తున్న విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పాడేరు:ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా పాడేరు ఐటిడిఏ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అత్యవసర రక్తదాన శిబిరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఐటిడిఏ పిఒ అభిషేక్ చేతుల మీదుగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక ఆర్టీసీ, ఐటీడీఏ ఉద్యోగులు, పోలీస్, ఫైర్ శాఖల సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్‌లు 50 మంది దాతలు రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..రక్తదానంతో ఒక ప్రాణాన్ని కాపాడు వచ్చన్నారు. యువత ముందుకు వచ్చి రక్తాన్ని దానం చేయాలని పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు ఐటిడిఏ చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రక్తదాన శిబిరాలు నిర్వహించామన్నారు. పాడేరు ఐటిడిఏలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆర్టీసీ ఉద్యోగులు 25 మంది రక్తదానం చేశారని అభినందించారు. అన్ని శాఖల అధికారులు విరివిగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

ఐటీడీఏ పీవో మాట్లాడుతూ, రక్తదాన శిబిరాలలో దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. అవసరానికి రక్తం తీసుకోవడమే కాకుండా రక్తదానం చేసేందుకు కూడా ముందుకు రావాలని విన్నవించారు. రక్తదాతలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, చైర్మన్ ఐటిడిఏ పీ ఓ వి.అభిషేక్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, డిసిహెచ్ఓ డాక్టర్ కృష్ణారావు, రెడ్ క్రాస్ సభ్యులు పి.సూర్యారావు, జయలక్ష్మి, గౌరీ శంకర్, జిల్లా కోఆర్డినేటర్ లోహితస్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున కలెక్టర్, పిఒ

విద్యార్థుల కెరీర్ అభివృద్ధికి 'మార్గదర్శిని'

ప్రజాశక్తి-పాడేరు: ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థుల కెరీర్ మెరుగు పరచడానికి, కెరీర్ అభివృద్ధికి "మార్గదర్శిని" పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రకటించారు. శుక్రవారం పాడేరు మండలం కందమామిడిలో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాటశాలలో ఏర్పాటు చేసిన ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలలో పాల్గొన్న పాల్గొన్న కలెక్టర్ విధ్యార్థులతో మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో ఏమి కావాలని కోరుకుంటున్నారో అది సాధించడానికి తగు మంచి నిర్ణయం తీసుకొని దానిని సాధించాలని సూచించారు. వారిలో ఉన్న ఆశక్తి, పోజిటివ్, నెగటివ్ కోణాలు, లోపాలు వంటి అంశాలను తెలియజేశారు.కెరీర్ మెరుగుకు, అభివృద్ధికి సచ్చందంగా పని చేయడానికి ఆశక్తి గల ఇద్దరు ముగ్గురు మెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు.

ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ, పోటీ తత్వమే గెలిపిస్తుందని తెలిపారు. గెలవాలన్న కోరిక దృఢంగా ఉండాలని వివరించారు. ఈ మార్గదర్శిని ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆడ పిల్లలు 21 సంవత్సరాలు పూర్తి అయ్యేవరకు పెళ్లి చేసుకోరాదని సూచించారు.ముందుగా ఆ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఎటిడబ్ల్యుఒ ఎల్. రజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలుచోట్ల గిరిజన రైతులు మొక్కల నాటివేత

ప్రజాశక్తి-పాడేరు:ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏజెన్సీలో గిరిజన రైతులు 4 లక్షల 98 వేల 530 మొక్కలను నాటారని ఐటిడిఏ పి.ఓ వి.అభిషేక్ వెల్లడించారు. శుక్రవారం ఉదయం ఐటిడిఏ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. అనంతగిరి మండలంలో 61 మంది రైతులు 64 ఎకరాలలో 33,600 సిల్వర్ ఓక్ 1120 జీడిమామి మొక్కలను నాటారని చెప్పారు. అరకులోయ మండలంలో 51 మంది రైతులు 51 ఎకరాలలో 24,500 సిల్వర్ ఓక్,960 జీడి, చింతపల్లిలో 163 మంది రైతులు 164 ఎకరాలలో1,13,400 సిల్వర్ ఓక్, 400 జీడి, డుంబ్రిగుడలో 58 మంది 58 ఎకరాలలో 40,600 సిల్లర్ ఓక్, జి.మాడుగులలో 50 మంది 50 ఎకరాలలో 35,000 సిల్వర్ ఓక్, జి.కె. వీధి లో 80 మంది రైతులు 80 ఎకరాలలో 56,000, హుకుంపేట లో 76 మంది రైతులు 76 ఎకరాలలో 53,200 సిల్వర్ ఓక్, కొయ్యూరులో 137 మంది రైతులు 137 ఎకరాలలో 25,900 సిల్వర్ ఓక్, జీడి 5250,840 కొబ్బరి,660 ఆయిల్ పామ్, ముంచంగి పుట్టు మండలంలో 53 మంది రైతులు 53 ఎకరాలలో 37,100 సిల్వర్, పాడేరు లో 50 మంది రైతులు 50 ఎకరాలలో 35,000 సిల్వర్ ఓక్ మొక్కలు, పెదబయలు మండలంలో 50 మంది రైతులు 50 ఎకరాలలో 35000 సిల్వర్ మొక్కలు నాటారని తెలిపారు.

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ గత్తర జిల్లేడలో శుక్రవారం ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 200 సిల్వర్ ఓక్ మొక్కలను నాటారు. సర్పంచ్ పి.కొములు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి మొక్కలు పెరిగే వరకు సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఒ సూరిబాబు, వి ఆర్ పి ప్రకాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో మొక్కలు నాటుతున్న గ్రామస్తులు

నిబద్ధత కలిగిన నేత బుద్ధదేవ్

సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య నిబద్ధత కలిగిన ప్రజా నాయకుడని, ఆయన మృతి బాధాకరమని సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం సంతాప సభను సి.పి.ఎం పార్టీ మండల కార్యదర్శి ఎల్.సుందర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంతాప సభలో అప్పల నరస మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే బుద్ధదేవ్ పార్టీలో చేరారని, యువజన ఉద్యమాల్లోనూ, వివిధ పోరాటాల్లో ఆయన పాల్గొన్నారని చెప్పారు. పశ్చిమ బెంగాల్ డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ (డివైఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారని, పార్టీ బెంగాల్ రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా కీలక నేతగా వ్యవహరించారని కొనియాడారు. కేంద్ర కమిటీ సభ్యులుగా పార్టీ విధానాల రూపకల్పనలో బుద్ధదేవ్ విశేషమైన, కీలకమైన సేవలందించారని పేర్కొన్నారు. వామపక్ష సంఘటన ప్రభుత్వంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు మంత్రిగా, ముఖ్యమంత్రిగా బుద్ధదేవ్ విశిష్ట పాత్ర పోషించారన్నారు. వామపక్ష ప్రభుత్వ విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, తర్వాత కూడా ఆయన రెండు గదుల అపార్ట్మెంట్లోనే నివసించారని తెలిపారు.బడుగు, అట్టడుగు వర్గాల ప్రజల కోసం పనిచేసి ఆయన జీవితాంతం పార్టీ విలువలకే కట్టుబడ్డారని కొనియాడారు. కార్మికోద్యమంలో అగ్ర భాగాన నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.బాల్ దేవ్, ఎస్.ధర్మాన పడాల్, జీవన్, కార్తీక్, చిన్నారావు, వరహాల బాబు, పి.ఎం.అర్.సి కోలని మహిళలు పాల్గొన్నారు.

మచ్చలేని మహానేత బుద్ధదేవ్

చింతూరు : పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య మచ్చలేని మహానేత అని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్ అన్నారు. బుద్ధదేవ్ మృతి బెంగాల్ ప్రజలతో పాటు పార్టీకి, పేద ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి సురేష్, వెంకట్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో వారు మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లో 33 ఏళ్ల వామపక్ష ఫ్రంట్ పాలనలో కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య హోం మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, 11 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పని చేశారని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యోగాన్ని వీడి ప్రజాసేవకు అంకితమైన యువజన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. సిపిఎం ప్రతినిధిగా చట్టసభలకు ఎన్నికై తన సుదీర్ఘ రాజకీయాల్లో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో అనేక పదవులు చేపట్టినా ఆయనపై ఏనాడు ఎలాంటి ఆరోపణలు లేవన్నారు. నేటి యువతకు, పార్టీ కార్యకర్తలకు ఆయన ఆదర్శమూర్తి అని, ఆయన అడుగుజాడలలో నడవాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజలతో మమేకమవటమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, చింతూరు మండల నాయకులు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, వేక రాజ్ కుమార్, ముట్టం రాజయ్య, సోడే లెనిన్, వీరబోయిన దిలీప్, వేక గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం, గిరిజన సంఘం నేతలు

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - అడ్డతీగల

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు నాగమణి అధ్యక్షతన శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దారు నాగమణి, ఎంపీడీవో విజయ రంగారావు, ఇన్చార్జి సిడిపిఒ వై.సుధా బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు ఇబ్బందులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు : బాల్యవివాహాలను అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కొయ్యూరు ఎస్సై రామకృష్ణ, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి విజయకుమారి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో బాల్య వివాహాలు నిలుపుదల గురించి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంబాబు, పీహెచ్సీ పీహెచ్ఎన్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డతీగలలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

అల్లూరి మన్యంలో అదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వపరంగా అధికారికంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో వేడుకలను నిర్వహించగా, ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా వేడుకలు జరిగాయి.ఆదివాసీ పతకాన్ని ఆవిష్కరించి, అమరవీరులకు నివాళులర్పించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా విబిన్న వేషధారణలతో చిన్నారులు, మహిళలు అలరించగా, గిరిజన సంప్రదాయ మేళతాళాలు, థింసా నృత్యాలతో మన్యవాసులు సందడి చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మన్యంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఆదివాసీలను గెంటేసే కుట్రను ప్రతిఘటించాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్

రంపచోడవరంలో మాట్లాడుతున్న కిరణ్

ప్రజాశక్తి-రంపచోడవరం : కేంద్రంలో మరో సారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆదివాసీలను రక్షణగా ఉన్న చట్టాలను రద్దు, నిర్వీర్యం చేసి ఆదివాసీలను అడవి నుండి గెంటివేసే కుట్ర చేస్తున్నారని, ఆ కుట్రను ప్రతిఘటించాలని ఏపి ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో సంఘం నాయకులు కె.శాంతిరాజు అధ్యక్షతన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘం సీనియర్ నాయకురాలు కలికోట రమణమ్మ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం బొప్పెన కిరణ్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అడవులను, అటవీ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఏజెన్సీలో 100 శాతం ఉపాధ్యాయ ఉద్యోగాలు ఆదివాసీలకే కేటాయించాలన్న జిఒ నెంబర్ 3ని ప్రభుత్వాల కుట్రల ఫలితంగానే సుప్రీం కోర్టు కొట్టి వేసిందని తెలిపారు. జిఒ 3 పునరుద్ధరణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోపోవడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. 1/70 చట్టాన్ని ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయడం లేదన్నారు. గిరిజన ప్రాంతాలలో నేటికీ రహదారులు లేక, అనారోగ్య సమయంలో ఆసుపత్రికి వెళ్లడానికి అంబులెన్స్ రాక ప్రాణాలు కోల్పోతున్న దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంఘం జిల్లా నేత మట్ల వాణిశ్రీ, కొమరం పెంటయ్య, కాలింగ్ కోట రమణమ్మ, జి మల్లికార్జునరావు, 350 మంది గిరిజనులు పాల్గొన్నారు.

చింతూరు : ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిఒ నెంబర్ 3పై రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ప్రకటన చేస్తుందని ఎదురు చూసిన ఆదివాసీలకు తీవ్ర నిరాశ మిగిలిందని ఏపి ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్, నాయకులు సీసం సురేష్ అన్నారు. ముందుగా ఆదివాసీ అమరవీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఎన్నికలలో పాడేరు సభలో చంద్రబాబునాయుడు జిఒ 3పై హామీ ఇచ్చారని, దానిని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, ఏజెన్సీలో ప్రభుత్వ అన్నీ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యండపల్లి వేక రాజ్ కుమార్, ముట్టుం రాజయ్య, పోడియం లక్ష్మణ్, బీరాబోయిన దిలీప్, సుబ్బారావు పాల్గొన్నారు.

మండలంలోని వేకవారి గూడెంలో ఆదివాసి జెండాను ఎంపీటీసీ వేక రాజ్ కుమార్, సర్పంచ్ వేక ప్రసాద్, గ్రామ పటేల్ వేక మంగయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేక లెనిన్, అడ్వకేట్ రవితేజ, వేక శంకర్, వేక అనిల్ కుమార్, వేక లక్ష్మణరావు, వేక గోవింద్, వేక నవీన్, వేక శేఖర్, సాయికుమార్, కన్నారావు పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని టేకులబోరు సెంటర్లో గిరిజన సంఘం సీనియర్ నాయకులు పాయం సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు. సంఘం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మడివి రవితేజ మాట్లాడుతూ గిరిజనులకు 100శాతం ఉద్యోగాలు రావాలంటే జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కారం జయసుధ, దర్ముల అమ్మాజీ, సర్పంచ్ మడకం నాగమణి, బొగ్గ వెంకమ్మ మాడెం జులూరావు, నాయకులు సోడే శంకర్ పాల్గొన్నారు.

పాడేరు: ఆదివాసీ హక్కుల సాధన కోసం చట్టాల అమలు కోసం సంఘటితమై ఉద్యమించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బాలదేవ్ పిలుపునిచ్చారు. ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకొని పాడేరు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీఎంఆర్సీ కాలనిలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.ధర్మానపడాల్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బాలదేవ్ మాట్లాడుతూ, ఆదివాసులకు ఇచ్చిన హామీ అమలుకు కూటమి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జనరల్ డిఎస్సీ లో కూడా స్థానిక ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, జీవన్ మాట్లాడుతూ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో జూనియర్ కళాశాల వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపడా వసతి సౌకర్యం కల్పించాలని, కాస్మెటిక్ చార్జీలు పెంచాలన్నారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ సుందర్రావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు వంతల హరేంద్ర దాస్ వరహాల బాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్నారావ్ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ఆదివాసి ప్రాంతంలో గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు గిరిజనులంతా ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జేఏసీ, ఆదివాసి గిరిజన సంఘం, ఉపాధ్యాయ సంఘం, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ జంక్షన్ వద్ద ఆదివాసి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు కె.రామారావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నూతన అటవీ పాలసి విధానం తీసుకొచ్చి ఉన్న చట్టాలను తుంగలో తొక్కి గిరిజనులకు అడవి నుండి దూరం చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు జి.బుజ్జిబాబు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అరకు జోన్ ఉపాధ్యక్షుడు పి నందో, మండల అధ్యక్షుడు జర్సీ సింహాచలం, జనరల్ సెక్రటరీ సాంబశివరావు, ఉపాధ్యాయ సంఘాల డుంబ్రిగుడ మండల అధ్యక్షుడు రాంప్రసాద్, కామేశ్వరరావు లచ్చన్న దొర కె భగత్రాం, జేఏసీ నాయకులు జి.మహదేవ్, ఆనంద్, బుద్ధు, గోపాల్, రామచందర్, వెంకట్, అప్పారావు, సిద్దేశ్వరరావు, నారాయణ పాల్గొన్నారు.

పెదబయలు :మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా గిరిజనులు, విద్యార్థులు, ఉద్యోగులు గిరిజన సాంప్రదాయ వేషాలతో ర్యాలీ చేపట్టారు.గిరిజన ఉద్యమ నేత పాంగి పాల్గుణ చేతుల మీదుగా ఆదివాసి గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించారు.అనంతరం జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు బోండా సన్నిబాబు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో వెంటనే స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నేతలు పప్పుల విఘ్నేశ్, చెండా రామారావు పాల్గొన్నారు .

అడుగులపుట్టు పంచాయతీ వడ్డేపుటు గ్రామంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కిల్లో సర్బన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు సునీల్ కుమార్ మాట్లాడుతూ, రోడ్డు సౌకర్యం లేక డోలి మోతలతో ఆదివాసీలు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్, లింగన్న, రామారావు, రామన్న, సుందర్రావు పాల్గొన్నారు.

పెదబయలులో మాట్లాడుతున్న సన్నిబాబు

పాడేరులో ర్యాలీ చేపడుతున్న నాయకులు

ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో...

ముంచంగిపుట్టులో సంప్రదాయ వేషధారణలో చిన్నారులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండంలోని ఆధివాసీ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ దినోత్సవాని పురస్కారించుకొని గుంటసీమ పంచాయతీ కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక దుంబ్రిగుడ ఎస్ఐ సంతోష్కుమార్ గిరిజన యువతకు వాలీబాల్ కిట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి సాగు, విక్రయాలు చట్ట విరుద్ధమన్నారు. వాటి జోలికి పోకుండా వ్యవసాయ పంటలను సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మండల కేంద్రంలో ఆదివాసి ట్రస్ట్ ఆధ్వర్యాన గిరిజనులు అడ్డాకుల గిడుగులతో ర్యాలీని నిర్వహించారు. కంద్రూమ్ ప్రాథమిక పాఠశాలలో ప్రదానోపాధ్యాయుడు సంజీవరావు ఆధ్వర్యంలో విద్యార్థులు దింసా నృతాలు చేశారు. ఉపాధ్యాయులు ఎస్.బాలకృష్ణ. నిరంజన్, తులసిదస్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలోని పోలిపుట్టు పంచాయతీ కడుతులఅంగన్వాడి కేంద్రంలో ఆదివాసి దినోత్సవ వేడుకలు నిర్వహించారు.దింసా నృత్యాలను చిన్నారులతో చేయించారు.

జిమాడుగుల: మండల కేంద్రంలో ఆదివాసి ట్రస్ట్ కార్యాలయంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమలింగం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బాలయ్య దొర, ఆదివాసి ట్రస్ట్ సీనియర్ సభ్యులు లోచలి మహేష్, లకే భాస్కరరావు, కిట్లంగి దావీదు, ప్రేమ్ కుమార్, వి.కృష్ణమ నాయుడు, .సింహాచలంరాజు, గొల్లూరి గోవిందరావు, బుజ్జి బాబు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : ఎంపీడీవో, తహశీల్దారు ఆధ్వర్యాన ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ పాఠశాల నుండి పోలీస్ స్టేషన్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీపీ పాఠశాలలో ఆశ్రమ బాలుర పాఠశాల హెచ్ఎం మడకం రామారావు ఆధ్వర్యంలో జరిగిన సభలో మండలంలోని ఐదు తెగలకు చెందిన ఆదివాసీ పెద్దలను సత్కరించారు. జాతీయ పతాకాన్ని, ఆదివాసీ జెండాలను ఆవిష్కరించారు. ఆదివాసీ సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో డిటి బాలాజీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్థానిక తాహశీల్దార్ డివి సత్యనారాయణ, సిఐ సన్యాసినాయుడు అన్నారు. రాజవొమ్మంగిలో జరిగిన ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవింద్ వెంకటలక్ష్మి, జడ్పిటిసి ఒడుగుల జ్యోతి, స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంపీడీవో లోకల యాదగిరి ఈశ్వరరావు, జిసిసి మేనేజర్ విజయలక్ష్మి, ఎంఈఓ 2 సూరారెడ్డి, ఆదివాసి జేఏసీ నాయకులు లోతా రామారావు, వంతు బాలకృష్ణ, బోడారపు కృష్ణ, వజ్రపు అప్పారావు, కె మురళీకృష్ణ, సిహెచ్ శివ, జి పెద్దిరాజు, ఈ శ్రీను,పాల్గొన్నారు.

అడ్డతీగల : స్థానిక ఆదివాసి భవన వద్ద ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా జెండాను ఎగరవేసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదివాసీ భవన వద్ద పందులు కామరాజు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. సాంస్కృతిక నృత్యాలు కోయ డాన్సులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు నాగమణి, ఎంపీడీవో విజయ రంగారావు, నాయకులు బేలం నూకరాజు, నడింపల్లి బంగార్రాజు, చెక్క వెంకటరత్నం డిఈ, సమర్ధ కృష్ణ, బొగ్గుల కాటంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ కాక కామేశ్వరి ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. మామిడి మొక్కను నాటి కార్యక్రమాన్ని చేపట్టారు. కేజీబీవీ, గిరిజన బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణ, ఎంఈఓ రాజులు, సచివాలయం ఇతర శాఖల అధికారులు మహిళా సంఘం, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎటపాకలో ఆదివాసీ అమరులకు నివాళులు

విఆర్.పురం : స్థానిక రేఖపల్లి తహశీల్దారు కార్యాలయంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు స్థానిక తాహశీల్దార్ ఆధ్వర్యాన జరిగాయి. కార్యక్రమంలో రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్, విఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు : గూడెం కొత్తవీధి మండలం కల్యాణ మండపంలో ఆదివాసీ జేఏసీ నాయకుల ఆధ్వర్యాన ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. తహశీల్దారు, సీఐలు అశోక్ కుమార్ అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని మన్యం గాయకుడు డి.సత్యనారాయణ రాసిన పాటను ఆవిష్కరించారు. వివిధ రూపాల్లో గిరిజనులు వస్త్రాలు ధరించి వారి ఆచారాలను చాటిచెప్పారు. కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు ఆదివాసీలు పాల్గొన్నారు.

దేవీపట్నం : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఇందుకూరుపేట ఆదివాసీ భవనం ప్రాంగణంలో ఆదివాసీ జెండాను జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవీపట్నం తాసిల్దార్ చలపతిరావు, ఏటిపి డివిజన్ నాయకులు చిచ్చటి శేషారావు, తుర్రం రామకృష్ణ దొర, ఎంఈఓ శిరసం బాలు దొర, మడకం బంగారుబాబు, కారం రామన్న దొర, ఎంపిటీసీ తుర్రం జగదీష్ దొర, చిచ్చడి శేషారావు, కుంజం శ్రీనివాస్ దొర, సర్పంచ్ కోసు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

టంగులగొందిలో వాలీబాల్ కిట్లు, పుస్తకాలు అందిస్తున్న పోలీసాధికారులు

గిరిజనులకు అండగా..

ప్రజాశక్తి-చింతూరు : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా చింతూరు ఎఎస్పీ రాహుల్ మీనా చింతూరు మండలం లచ్చిగూడెం గ్రామాన్ని సందర్శించి, గిరిజనులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యాన గ్రామస్తులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎఎస్పి మాట్లాడుతూ గంజాయి పండించడం, రవాణా చేయడం, తాగడం నేరమని, గంజాయి కేసుల్లో ఇరుక్కుని యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో చింతూరు సిఐ గజేంద్ర కుమార్, చింతూరు ఎస్ఐ శ్రీనివాస్, డొంకరాయి ఎస్ఐ శివకుమార్ పాల్గొన్నారు.

యువతకు వాలీబాల్ కిట్లు

సీలేరు : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జీకే వీధి పంచాయతీ పరిధి టంగుల గొంది గ్రామాన్ని జీకే వీధి సిఐలు అశోక్ కుమార్, అప్పలనాయుడు ఆధ్వర్యాన పోలీసులు శుక్రవారం సందర్శించారు. ఆదివాసీ దినోత్సవ ప్రాముఖ్యతను యువతకు వివరించారు. అనంతరం వాలీబాల్ కిట్లు, విద్యార్థులకు నోటు పుస్తకాలు, ప్లాంక్‌లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు అవరోధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పెన్నులు..

కొయ్యూరు : ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా మంప ఎస్సై లోకేష్ కుమార్, సిబ్బందితో మండలంలోని బూదరాళ్ల పంచాయతీ మూకుడుపల్లి గ్రామాన్ని సందర్శించారు. మూకుడుపల్లి స్కూల్ పిల్లలకు నోట్ బుక్స్, పెన్నులు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు.

దుప్పట్లు, చీరలు

రంపచోడవరం : అదివాసీ దినోత్సవం సందర్భంగా చర్చస్ ఆఫ్ క్రైస్ట్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బి.జాన్ రత్నం ఆధ్వర్యాన మండల కేంద్రంలో స్థానికులకు దుప్పట్లు, చీరలు, పంపిణీ చేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిఒ చైతన్య, తదితరులు

పిఎం జన్ మన్ యోజన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చింతూరు : ప్రధానమంత్రి జన్ మన్ యోజన పథకం పోస్టర్‌ను చింతూరు ఐటిడిఏ పీవో కావూరి చైతన్య, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఇ డి.తిలక్‌కుమార్, ఎడిఈ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పిఎం జన మన్ యోజన పథకం కింద నాలుగు మండలాలలో మొత్తం 94 మంది హిల్ టాప్ కొండ రెడ్డి లబ్ధిదారులకు సోలార్ స్టాండ్ ప్యానెల్స్, 5 బల్బులు, ఒక ఫ్యాన్, 2 స్విచ్ బోర్డులు అందించడం జరుగుతుందని చెప్పారు. దేశంలోనే తొలిసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చింతూరు ఐటిడిఏ పరిధిలో ఈ స్టాండ్ సోలార్ సెట్‌లు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.

శిబిరాలకు 'స్థానిక ఎమ్మెల్సీ' ఓటర్లు

గెలవాలన్న పట్టుదలతో వైసిపి, టిడిపి
పలువురిని ఆకర్షించే పనిలో అధికార పార్టీ
ఓటుకు ఐదు లక్షల ఆఫర్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపొందేందుకు వైసిపి, టిడిపి ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నాయి. వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ గెలవడానికి గట్టి ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా గ్రామ స్థాయి నాయకులను వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి పిలిపించుకుని విడివిడిగా మాట్లాడి విజయానికి పని చేయాలని కోరుతున్నారు. అరకు, పాడేరు నియోజకవర్గాల్లోని ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులను ఇప్పటికే బెంగుళూరుకు తీసుకెళ్లారు. ఎన్నిక రోజు వారిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లి ఓటు వేసేలా వైసిపి ఏర్పాట్లు చేసింది. 838 ఓట్లలో 600కు పైగా వైసిపికి చెందిన ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఉన్నారు. ఆ ఓట్లు చెక్కు చెదరకుండా వైసిపి అభ్యర్థికి పడేలా ఆ పార్టీ జాగ్రత్తలు తీసుకుంటోంది. సంఖ్య రీత్యా తక్కువ మంది కూటమి పార్టీలకు ఉన్నప్పటికీ గెలవాలన్న పట్టుదలతో టిడిపి ఉంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వైసిపికి చెందిన కొంతమంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను ప్రలోభ పెట్టి గెలిచే పనిలో టిడిపి ఉంది. ఓటుకు ఐదు లక్షలు ఇవ్వడానికి అధికార పార్టీ సిద్ధపడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. తమ పార్టీ ప్రజా ప్రతినిధులు టిడిపి వైపు చూడకుండా రెండు లక్షలు చొప్పున వైసిపి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

జంపింగ్‌లు

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తరువాత నుంచి చేస్తున్న ప్రయత్నాలలో కొంతమంది ఎంపిటిసిలు టిడిపి, జనసేనల్లో చేరుతున్నారు. మరికొంతమందిని చేర్చుకోవడానికి మంతనాలు చేస్తున్నారు. యలమంచిలి మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు రాజాన శేషు, శిలపరశెట్టి ఉమ, బర్రె శివలక్ష్మి శుక్రవారం జనసేనలో చేరారు. మునగపాక మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు చిందాడ దేవి జనసేనలో గురువారం చేరారు. యలమంచిలి మాజీ వైసిపి ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు ముఖ్య అనుచరుడు కర్రి శివ శుక్రవారం అమరావతిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. తమ బలాన్ని కాపాడుకొనే పనిలో వైసిపి క్యాంపు నడుపుతుండగా, వైసిపి నుంచి వచ్చే వారితో క్యాంపు పెట్టాలని టిడిపి చూస్తోంది. అధికారంలోని కూటమి పార్టీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులెవరూ వైసిపికి వెళ్లే అవకాశం లేనందున టిడిపి అభ్యర్థిని బలపర్చే వైసిపి ప్రతినిధులతో శిబిరం నిర్వహించాలని టిడిపి భావిస్తోంది. కూటమి ఓట్లు టిడిపి అభ్యర్థికి పడేలా ఎమ్మెల్యేలకు చంద్రబాబు బాధ్యత అప్పగించారు. టిడిపి అభ్యర్థిని గెలిపించడానికి అనకాపల్లి బిజెపి ఎంపీ సిఎం రమేష్ సమన్వయం చేస్తున్నట్లు తెలిసింది.

బెంగళూరులో వైసిపి శిబిరంలో ఉన్న పాడేరు ఏజెన్సీ ఎంపిటిసిలు

కెజిహెచ్‌లో డబ్బులడిగితే ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో ఇక లంచాలకు తావు లేదని, డబ్బులడిగిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద తెలిపారు. ఆసుపత్రిలోని తన ఛాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కెజిహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, డాక్టర్లు, రోగుల మధ్య అనుబంధం పెరిగేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రోగులు ఆసుపత్రిలో పడుతున్న ఇబ్బందులు మీద ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతో కలెక్టర్ ఆఫీసులో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. రోగులకు ఏ ఇబ్బంది ఉన్నా 0891- 2590100, 2590102 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఆయుష్మాన్ డిజిటల్ మిషన్ కింద మెడికల్ రికార్డ్స్ నమోదు వల్ల రోగులకు ఎంతో ఉపయోగమన్నారు. రోగుల సహాయం కోసం ఎనిమిది కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బ్లడ్ రిపోర్ట్ కోసం రోగి వేచి ఉండకుండా వాట్సాప్ ద్వారా పంపే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బర్త్, డెత్ సర్టిఫికెట్ కోసం కూడా పలువురు ఇబ్బంది పడుతున్నారని, అటువంటివారికి ఆధార్ కార్డు వివరాల ఆధారంగా సర్టిఫికెట్ జారీ చేస్తామని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో ప్రతి వార్డును ఎప్పటికప్పుడు శుభ్రపరిచే చర్యలు ప్రారంభించామని తెలిపారు.

ఆదివాసీ ప్రజాప్రతినిధులకు అగౌరవం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఐటిడిఎ పరిధిలోని శుక్రవారం జరిగిన ఆదివాసీ దినోత్సవానికి ఆహ్వానించి, జెండా ఆవిష్కరణకు, జ్యోతి ప్రజ్వలనకు, వేదిక పైకి స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ, స్థానిక సర్పంచ్, స్థానిక ఎంపీటీసీలను పిలవకుండా గిరిజన ప్రజా ప్రతినిధులను అగౌరవపరిచారని రంపచోడవరం మండల ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ఈ మేరకు ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీటీసీ తుర్రం వెంకటేశ్వర్లు దొర, ఇతర ప్రజా ప్రతినిధులు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇది ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలా లేదని, అధికారంలో ఎవరు ఉంటే వాళ్ళ కార్యక్రమంగా ఉందని పేర్కొన్నారు. తమను స్థానిక ప్రజాప్రతినిధులుగా గుర్తించకపోయినా ముందు ఆదివాసీలుగా గురించాలని ఐటిడిఎ అధికారులకు హితవుపలికారు.

ఆదివాసీ దినోత్సవం కార్యక్రమం అధికారిక కార్యక్రమంగా కాకుండా తెలుగుదేశం పార్టీ కార్యక్రమంగా జరుపుకుంటున్నారని, దీనిపై వైసిపి ప్రజాప్రతినిధులంతా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

సరుకులు పంపిణీ చేస్తున్న పాస్టర్స్ సంక్షేమ సంఘం సభ్యులు

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- విఆర్.పురం : కూనవరం మండలం చిన్నఆర్కూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని వరద బాధితులకు క్రీస్తు ప్రేమను చాటి చెప్పుటకు పాస్టర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి బిషప్ డాక్టర్ చంద్ర పాల్, డివిజన్ చైర్మన్ మనోహర్, కార్యదర్శి మెల్కీసేదేక్ తమ బృందంతో వచ్చి వరదల ఇబ్బంది పడుతున్న కుటుంబానికి 5 కేజీలు చొప్పున బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు 200 కుటుంబాలకు అందించారు. అనంతరం 200 మందికి భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో పాస్టర్ ఎలీషా, మారనాత, పాస్టర్ మోజెస్, శబరి కొత్తగూడెం, జిన్నెలగూడెం, టేకులబోరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

క్రాస్ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యాన...

ఇటీవల గోదావరి వరదలు కారణంగా విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల్లోని పలు గ్రామాలలో వరదలకు ఇబ్బంది పడిన బాధితులకు గుంటూరు క్రాస్ మినిస్ట్రీస్ ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ బి.జేమ్స్ భాస్కర్ నిత్యావసర సరుకులు అందించారు. విఆర్.పురం బిసి కాలనీ పాస్టర్ కె.కృపారావు ద్వారా డాక్టర్ జేమ్స్ భాస్కర్ తన టీమ్ టీంతో వచ్చి పోచారం కాలనీ, కాచవరం, జిన్నెల గూడెం, కొండాయి గూడెం, కూనవరం, విఆర్.పురం, ధర్మతాళ్ల గూడెం, వడ్డీగూడెం, చింత రేగుపల్లి గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో 300 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, బకెట్లు, దుప్పట్లు, తువ్వాళ్లపంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేమ్స్ భాస్కర్ మాట్లాడుతూ విలీన మండలాల ప్రజలు ప్రతి ఏటా వరదలు కారకంగా ఎన్నో ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొంటున్నారని, కొన్ని సార్లు ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి వంతుగా సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ పాస్టర్ కె.కృపారావు, పాస్టర్లు సిహెచ్ రాజేష్, డేవిడ్, శ్రీకాంత్, రమేష్, కె.సురేష్, బి.ప్రవీణ్ జోసెఫ్, ఎ.యిర్మీయా, కె నాని శ్యామ్, ఎన్ ప్రేమ్ సాగర్, కె కరుణాకర్ పాల్గొన్నారు.

ఎపి జెన్కో సీలేరు కాంప్లెక్స్‌లో స్పెషల్ జాబ్ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ పరిధిలో స్పెషల్ జాబ్ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని సిపిఎంకు చెందిన గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని మోతుగూడెం, డొంకారాయి, సీలేరు, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాల్లో సివిల్, ఓ అండ్ డ్యామ్ విభాగాల్లో అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగాలు నోటిఫికేషన్ విడుదల చేసి స్థానికతను ప్రాతిపదికన, డిప్లమా, ఐటిఐ, డిగ్రీ నిరుద్యోగ గిరిజన యువతీ యువకులతో రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సీలేరు జల విద్యుత్ కేంద్రం నిర్మించి సుమారు 56 ఏళ్లు దాటినా, ఇప్పటికీ మన్యం వాసులకు ఈ జల విద్యుత్ కేంద్రాల్లో ఐదు శాతం కన్నా తక్కువ ఉద్యోగాలు మాత్రమే లభించాయని చెప్పారు. 1/70 యాక్ట్ పరిధిలో ఉన్న ఏపీ జెన్కో ఆధ్వర్యంలో నడుస్తున్న భవ్య ఆసుపత్రి, డిఎవి పాఠశాలలో ఉన్న పోస్టులు పై స్థాయి నుంచి కింద స్థాయి వరకు పారదర్శకతో నియామకాలు జరగడం లేదని తెలిపారు. ఏపీ జెన్కో ఆధ్వర్యంలో త్వరలో నిర్మించబోయే పంపు స్టోరేజ్ ప్రాజెక్టులో అన్ని విభాగాల్లో శాశ్వత ఉద్యోగాలు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు జాబ్ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. అధికారులు ఎటువంటి రాజకీయ, యూనియన్ల సిఫార్సులకు తలవంచకుండా చట్టబద్ధంగా నియామకాలు చేపట్టాలని బుజ్జిబాబు కోరారు. కొత్త ప్రాజెక్టు నిర్వాసితులకు భూమికి భూమి, ఇల్లుకి ఇల్లు, ఇంటికొక శాశ్వత ఉద్యోగం ఏపీ జెన్కో కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను త్వరలో జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు పిఒ, ఏపీ జెన్కో ఎండి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.